# “వాక్యము దేవుడైయుండెను”

# (1:1–13)

ఎ. ఎస్. న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్టు కవర్‌పై “యేసు ఎవరు?” అనే ప్రశ్న అడుగబడింది: మనం “ప్రభువు” అని పిలిచేవానిని గూర్చి దాని లోపలి భాగంలో యిలా చెప్పబడింది:

> కేవలం రెండు సంవత్సరాలలో, యేసు గారడివాడని, బాగుచేయువాడని, మత, సాంఘీక విప్లవకారుడని, గ్రామీణ తీవ్రవాద తాత్వికుడని పలు విధాలుగా చిత్రించబడ్డాడు. కుమ్రానులోని మృత సముద్రపు చుట్టల సమాజపు నాయకుడని, ఆయన సిలువ వేయబడిన తరువాత బ్రతికే ఉండి రెండు సార్లు పెండ్లి చేసికొని ముగ్గురు పిల్లలకు తండ్రియై ఉన్నాడని ఒక రచయిత సిద్ధాంతీకరించాడు.[1]

న్యూస్‌వీక్ వారపత్రిక కూడా 1994లో “యేసు మరణం” అనే దానిమీద ఈలాటి కవర్ పేజీ కథనే నడిపింది. “జీజస్ సెమినార్”గా తెలియబడిన లిబరల్ స్కాలర్స్ డెబ్బై ఏడుగురి ముఠాపై ఒక వ్యాసం రూపొందించబడింది. ఈ ప్రజలు సంవత్సరానికి రెండు సార్లు కూడి యేసు ఎవరు? ఆయన నిజంగా చేసింది ఏమి అనే సంగతులను మాట్లాడతారు. వారు జరిగించే ఒక వింతైన ఆచరణ ఏమంటే, సువార్త రచనల్లోని ఆయా లేఖన భాగాల అధికార ముద్రపై ఓటింగ్ చేస్తారు. ప్రతివానికి నాలుగు పూసలు యివ్వబడతాయి. ఎర్ర పూసలంటే – యేసు నిశ్చయంగా లేఖనం చెప్పినట్టే చెప్పాడు, చేశాడని వారు నమ్ముతారని అర్థం. యేసు చెప్పింది లేక చేసింది లేఖనం వర్ణించినదానికి దగ్గరగా ఉందని లేత ఎరుపు పూసలు సూచిస్తాయి. బూడిద రంగు పూసలైతే, లేఖనం చెప్పినట్టు యేసు చెప్పాడు చేశాడనేవారి సందేహాన్ని సూచిస్తుంది. నలుపు పూసలైతే, లేఖనం ప్రకటించినట్టు యేసు ఎన్నడూ తలంచలేదు లేక చేయలేదని సూచిస్తాయి. “జీజస్ సెమినార్”లోని అధిక సంఖ్యాకులు వచ్చి చేరుకున్న తీర్మానం దిగ్భ్రమ కలిగించేదిగా ఉంది, అది దేవదూషణ అని నేను నమ్ముతాను!

> “చారిత్రకమైన” యేసు ఏ అద్భుతాలు చేయలేదు, కాని ఆయనకు స్వస్థపరచే తాకుడుంది, అంగీకరించడం ప్రేమించడం ద్వారా ఉద్వేగ సంబంధమైన వ్యాధులను బాగుచేసే వరం ఉంది. పూర్ణంగా మానవ సమానత్వమనే దేవుని రాజ్యం కొరకు ఆయన పిలుపునిచ్చాడు – తీర్పు అనే ఏదో ఒక దినమప్పుడు కాదు, అయితే అది యిప్పుడు ఇక్కడే. దేవాలయ సంబంధమైన లేక దేశ సంబంధమైన అధికారపు పరంపరలచే ఆటంకపరచడని దేవునితో నేరైన అనుభవాన్ని జనులు పొందాలని ఆయన కోరాడు. యెరూషలేములో పస్కా కాలంలో ఆయన అల్లరి రేపినందున, అధికారులు దాదాపు

మామూలుగానే ఆయనకు మరణ శిక్ష విధించారు. ఆయన భౌతికంగా మృతులలోనుండి లేవలేదు, కాని ఆయన అనుచరులలో క్రొత్త, పాతవారి హృదయాలలో స్థిరస్మరణీయులుగా నిలిచిపోయాడు. సిలువ మీదనుండి దింపబడిన ఆయన దేహం లోతులేని సమాధిలో పాతిపెట్టబడియుండవచ్చు – అది కుక్కలచే తిని వేయబడియుండవచ్చు.[2]

ప్రభువైన యేసును గుర్తించే చర్చ పండితుల పరిధుల్లో మాత్రమే కాదు, యిండ్లలోను, కాఫీ హోటల్లోను లోక వ్యాప్తంగా వీధుల మూలలలోను జరుగుతుంది! "ఆయన చాల మంచివాడు" అని కొందరు నమ్ముతారు; "అసాధారణమైన ఉపదేశకుడు" అని యింకను కొందరు భావిస్తారు. ఆయన ఈ లోకంలో "జీవించిన వారందరికన్న మేధావి" అని కొందరు వాదిస్తారు. నిజంగా నజరేయుడైన యేసు ఎవరు అనేదాన్ని గూర్చి లోక జనులలో అధిక సంఖ్యాకులకు ఏదో ఒక రకమైన అభిప్రాయం ఉండనే ఉంది.

అలాటప్పుడు, ఈ చర్చను మనం చేయడం ఎందుకు? పైన పేర్కొనబడిన వార్తా పత్రికలో వ్యక్తపరచబడ్డ అభిప్రాయాలతో నేను గట్టిగా వ్యతిరేకిస్తూ, యేసును గూర్చి అనేక రకములైన భావనలు ప్రజల మధ్య నిలిచియున్నందున నేను నిజంగా అక్కరగలవాడనైయున్నాను. ఆయన భూమిమీద జీవించిన దాదాపు రెండువేల సంవత్సరాల తరువాత కూడా ప్రజలు యింకను "ఈ మనుష్యుడెవరు?" అని అడుగుతున్న వాస్తవాన్ని బట్టి నేను ఆకర్షితుడనయ్యాను. మనకు శుభవార్త ఏమంటే – ఈ ప్రశ్నకు ఖచ్చితమైన జవాబుతో యోహాను సువార్త ఆరంభమౌతుంది!

## వాక్యము (1:1-5)

"ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దైవుదై యుండెను" (1:1). యేసు యొక్క పుట్టుకను గూర్చిగాని బాల్యాన్ని గూర్చిగాని యోహాను ఏమియు చెప్పలేదు. దానికి బదులు "ఆదియందు" అంటూ అతడు ప్రారంభించాడు. పాత నిబంధనతో పరిచయమున్న వారికి ఈ మాటలు ఆదికాండం 1:1 యొక్క ప్రతిధ్వనిగా వినిపించుతాయి. యేసును గుర్తుపట్టి వివరించడానికి గాను యోహాను "ఆరంభానికి" వెళ్లవలసి వచ్చింది. లోకం ఉనికిలో లేకముందు యేసు ఉన్నాడు.

ప్రభువైన యేసును పరిచయం చేయడానికి వినియోగింపబడిన ఉచ్చరణ – "వాక్యము" అనేది. యేసే ఆ "వాక్యము" అని 14నుండి 18 వచనాలవరకు యోహాను చెప్పకపోయినా, ఆ పదం ఆయన్ను వర్ణించడానికే అతడు ఉపయోగించాడు. గ్రీకు, యూదా పాఠకులకు "వాక్యము," గ్రీకులో *logos* అనే పదం వేరైన భావాలనిస్తుంది. "వాక్యము" (లోగోస్) అంటే యూదులకు లోకాన్ని సృజించి, నిలబెట్టే దేవుని చురుకైన శక్తియని భావమొస్తుంది. ఆదికాండం 1, 2ల్లోను యెషయా 55:3, 11ల్లోను "వాక్యము"ను గూర్చి యిలా చెప్పబడింది. "దేవుడు వెలుగుకమ్మని పలుకగా వెలుగు కలిగెను" అని యూదులు జ్ఞాపకం చేసికొన్నారు (ఆది. 1:3). దేవుని వాక్యము నిజముగా శక్తిగలదైయుంది!

అన్యజనులు "వాక్యము" (లోగోస్) అనే ఉచ్చరణ విన్నప్పుడు, గ్రీకు తాత్వికులు ఆ

పదాన్ని ఎలా ఉపయోగించారో దానిని వారు జ్ఞాపకం చేసికొన్నారు. ఈ విశ్వమంతటికి క్రమాన్ని, భావాన్ని ప్రసాదించిన అపౌరుష శక్తిగా వారు చూచారు. ఒక వ్యాఖ్యాన కర్త గుర్తించినట్టు, నేడు మనం (న్యూక్లియార్ ఫ్యూషన్) మూలాణువుల విభజనను గూర్చి మనలో అనేకులు తలంచినట్లే, ఎక్కువమంది "వాక్యాన్ని" గూర్చి ఆలోచించియుండవచ్చు.[3] పరమాణువుల విభజనను గూర్చి వివరమైన వర్ణన మనం యివ్వలేకపోయినా, దాన్ని మన్నించేందుకు తగినంతగా మనం ఎరిగి, భయపడుతు, దాన్ని గూర్చి మాట్లాడుతాం కూడా.

యేసును పరిచయం చేయడానికి యోహాను "వాక్యము" (లోగోస్) అనే పదాన్ని వినియోగించినప్పుడు, అటు యూదులను, యిటు అన్యజనులను ఉలికిపడేలా చేశాడు. ఏ యేసును గూర్చి యోహాను వ్రాశాడో, ఆయన దేవుని చిత్తము యొక్క స్పష్టీకరణ, విశ్వం వెనుకనున్న సృజించు శక్తి, సమస్త ప్రాణాన్ని ఏకంగా నిలుపు బలమైయున్నాడు. కొలస్సీ. 1:15-17 యిలా అంటుంది,

> ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వ సృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు.

ఎవరేని ఒకరు "వాక్యము" (లోగోస్) అని ప్రస్తావించినప్పుడు జనులు ఏమి ఆలోచించినా, తన సువార్త రచనను యోహాను ఆరంభించడంలో, తాను వర్ణింపగోరినవానిని గూర్చి అతడు ధైర్యంగా చెప్పబూనాడు. త్వరితంగా, "వాక్యము దేవుని యొద్ద ఉండెను," "వాక్యము దేవుడైయుండెను," "సమస్తమును ఆయన మూలముగా కలిగెను," "కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు" అని యోహాను క్రమంగా తెలిపాడు (1:1-4). యేసు గొప్ప ఉపదేశ కర్త అని గాని మేధావి అని గాని యోహాను ప్రజలను నమ్మించాలని ప్రయత్నించలేదు; యేసు దేవుడు, దేవ స్వభావం గలవాడని అతడు ప్రకటించాడు!

## జీవపు వెలుగు (1:6-8)

మొదటి అయిదు వచనాలలో దిగ్భ్రమ కలిగించె క్లెయిమ్ తరువాత, మూడు వచనాలను బాప్తిస్మమిచ్చు యోహానును చర్చించడానికి యోహాను వినియోగించాడు. ఏలీయా, యిర్మీయాలవంటి గొప్ప ప్రవక్తగా మనలో ఎక్కువ మంది బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి తలంచినా, మొదటి శతాబ్దంలోని జనులు అతన్ని గూర్చి యింకా అధికంగానే తలంచారు. కొందరైతే అతన్ని క్రీస్తేనని అపార్థం చేసికొన్నారు! జనుల మధ్య యోహాను ఎంతగా కీర్తి గడించాడు, శక్తివంతంగా బోధించాడంటే, "నేను క్రీస్తును కాను" అన్నంతగా అతడు చెప్పుకోవలసి వచ్చింది (1:20).

ఆలాటి తబ్బిబ్బును బట్టి, బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తు కానట్టున్నూ, అతడు ఆయనకు ఒక ముఖ్యమైన సాక్షియై ఉన్నట్టుగాను ఈ సువార్త యొక్క లేఖకుడు ప్రత్యేకించి

చూపాడు: "(యోహాను) మూలముగా అందరు విశ్వసించునట్లు అతడు ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకు వచ్చెను" (1:7, 8). బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి ఈ సంగతి చెప్పడంవలన, అంత గొప్ప బాప్తిస్మమిచ్చు యోహాను సయితం యేసుకు సాటికాదని రచయిత ప్రకటించాడు! యేసు మాత్రమే (ఆయన ఒక్కడే) "వాక్యమై" ఉన్నాడు.

## నిరాకరింపబడినవాడు (1:9-11)

యేసు నిజంగా దైవికమైన వాక్యమైయున్నట్టయితే, అంతమంది ఆయనను ఎందుకు నిరాకరించారు? విపత్కరమైన ఈ శ్లేషార్థానికి నేరైన ఉత్తరమిస్తూ యోహాను యిలా అన్నాడు: "ఆయన లోకములో ఉండెను, లోకమాయన మూలముగా కలిగెను గాని లోకమాయనను తెలిసికొనలేదు. ఆయన తన స్వకీయులయొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు" (1:10, 11). లోక సృష్టికర్త తాను సృజించిన లోకంచేత నిరాకరింపబడ్డాడు! లోకం ఆయనను నిరాకరించిన దానిని బట్టి గతంలో ఆయన్ను గూర్చి అతడు గట్టిగా చెప్పుకొన్న సంగతులను వదలుకొనడానికి నిరాకరించాడు. యేసును లోకం నిరాకరించడం ఆయన గొప్పతనాన్ని నిరాకరించడం కాదు, లోకం దాని స్థితిని ప్రదర్శించుకొనడమేనని యోహాను అంటాడు. చీకటి ప్రపంచము తన వీపును ఆయన వైపు త్రిప్పినప్పుడు సహా యేసు "నిజమైన వెలుగు" గానే నిలిచి యుంటాడు (1:9)!

తాను సృజించిన లోకంచే యేసు నిరాకరించబడడం, ఒక దినమంతా కష్టపడి పని చేసిన తరువాత తన యింటికి తిరిగి వచ్చిన ఒక మనిషి యొక్క ఉపమానాన్ని పోలియుంది:

> ఆ దినం యొక్క ప్రయాసలచే అతడు సోలిపోయాడు, తన పని ముగించినందుకు ఆనందించాడు, తన కుటుంబంతో తిరిగి ఉండడానికి అతడు ఎదురు చూస్తున్నాడు. తన యింటికి సమీపమయ్యే కొలది అడుగులు త్వరగా పడుతున్నాయి. తన తాళపు చెవి కొరకు జేబును తడివి చూచాడు, అయితే అది అందులో లేదు; ఎలాగో అతడు దానిని చోటు తప్పియుంచాడు. అయినా ఫరవాలేదు; కుటుంబం యింటియొద్దనే ఉంది. కాబట్టి అతడు వెళ్లి బయట ద్వారం దగ్గర నిలిచి బెల్ కొట్టతాడు. ఏమీ జరగలేదు. అతనికి ఎవరూ తలుపు తీయలేదు. వారు అక్కడే ఉన్నారు, అతడు అక్కడ ఉన్నట్టు వారు ఎరిగే ఉన్నారు. కిటికీ దగ్గర కర్టన్ కొంచెం ప్రక్కగా తీసి, తాను ఎంతగానో ఎరిగిన కండ్లు తన్ను చూడ తిరిగాయి. అయితే అతడు అక్కడే నిలిచేలా విడిచాయి.[4]

తాను ప్రేమించి పోషించేవారిచే కుటుంబ యజమాని అలక్ష్యం చేయబడి నిరాకరించ బడడం యోచింపతగినదై ఉంది. అయినా, ఖచ్చితంగా యేసు లోకానికి వచ్చినప్పుడు జరిగింది అదే.

## మానవ రక్షకుడు (1:12, 13)

ఉద్రేకాన్ని కలిగించే యోహాను యొక్క పరిచయం నిరాకరింపబడిన చేదు అనుభవం

వద్ద ఆపుచేయబడలేదు. దానికి బదులుగా, రక్షణయను నిరీక్షణాత్మకమైన భావనతో అది ముగింపబడుతుంది. అందరూ తమ వీపులను యేసువైపు త్రిప్పలేదు. యోహాను యొక్క చర్చిలోని కొందరు నజరేతునుండి వచ్చిన బోధకుని వెంటాడగోరారు. ఆ విషయాన్ని యోహాను యిలా ప్రకటించాడు: "తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" (1:12). అందుకే యోహాను సువార్త వ్రాయబడింది. కొందరు విని విశ్వసింప వస్తారు (20:31). అలా నమ్మడంవలన యేసు నామమున వారు జీవం పొందుతారు!

## ముగింపు

ఆరంభము, "వాక్యము," విశ్వాసము అనే దానంతటిని గూర్చి మాట్లాడిందంతా – సోమవారం రోజున మరోవారపు పని ఆరంభించేటప్పుడు మీ జీవితాల్లో ఏ మార్పునైనా తెస్తుందా? అది తప్పక వ్యత్యాసం కలిగించాలి! అది లోకంలో ఎంతో వ్యత్యాసాన్ని కలిగిస్తుంది. యేసు కేవలం నరుడు కాడు సుమీ. యేసు కేవలం గొప్ప బోధకుడో లేక ఒక జ్ఞానంగల ప్రవక్తయో, లేక ఒక శక్తివంతుడైన నాయకుడో కాదు. ఆయన దేవుడు! ఆయనయందు మనం విశ్వాసముంచగోరినట్టయితే, యేసుకంటె లోకంలో ప్రాముఖ్య మయ్యింది ఏదీలేదని, ఆయన్ను ఎరిగేదానికంటె యింకా ఏదియు విశేషమయింది కాదని మనం కనుగొంటాం.

మనలను రక్షణకు ఆహ్వానించేది యోహాను సువార్త యొక్క యేసేగాని, జనుల అభిమానాన్ని పొందే నాగరికతచే హీనపరచబడిన యేసు కాదు. ఆయన కేవలం నరమాత్రుడే అయ్యుంటే, ఆ ఆహ్వానాన్ని మనం అంగీకరింప గోరవచ్చు లేక నిర్లక్ష్య పెట్టవచ్చు. అయితే ఆయన దైవికమైన దేవుని వాక్యమైయున్నందున, ఆయన ఆహ్వానాన్ని మనలో ఎవడైనా చులకనగా భావించేందుకు తెగింపగలడా?

> తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాస ముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు దేవునివలన పుట్టినవారేగాని, రక్తమువలననైనను శరీరేచ్ఛలవలననైనను మనుషేచ్ఛల వలననైనను పుట్టినవారు కారు (1:12, 13).

సూచనలు

[1]Jeffery L. Sheler, "Who Was Jesus?" *U. S. News & World Report* (20 December 1993): 62. [2]Russell Watson, "A Lesser Child of God," *Newsweek* (4 April 94): 53. [3]Leon Morris, *The Gospel According to John* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 116. [4]Leon Morris, *Expository Reflections on the Gospel of John* (Grand Rapids, Mich.: Baker Book House, 1988), 11.